క్లుప్తంగా

షెడ్డు నిర్మాణ పనుల పరిశీలన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):పోరంకిలోని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన వేద పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం షెడ్డు నిర్మాణం జరుగుతోంది. సుమారు రూ. 8 లక్షల వ్యయంతో దాతల సహకారంతో జరుగుతున్న షెడ్డు నిర్మాణ పనులను ఈవో కెఎస్.రామరావు బుధవారం పరిశీలించారు. వర్షాకాలం నాటికి షెడ్డు నిర్మాణం పూర్తయ్యేలా పనులు చేస్తున్నట్లు దాత చంద్రశేఖర్ పేర్కొన్నారు. షెడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పూర్తి జరిగేలా చూడాలని ఈఈ ఎల్. రమాదేవికి సూచించారు. కార్యక్రమంలో వేద పాఠశాల సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీనివాసునికి పంచామృత అభిషేకాలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని చిట్టినగర్‌లోని శ్రీ పద్మావతి గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో స్వామి వారికి బుధవారం పంచామృత అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి వారికి సుప్రభాత సేవ అనంతరం స్వామి వారి మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకాలు, విశేష అలంకరణ, అర్చన నిర్వహించారు. అనంతరం స్వామి వారి దర్శనానికి భక్తులు, ఉభయదాతలను అనుమతించగా, స్వామి వారికి విశేషంగా తులసీ దళాలతో అర్చన నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు రామరత్నమాచార్యులు నిర్వహించగా, దేవస్థాన కమిటీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

1న హనుమజ్జయంతి వేడుకలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):పాతబస్తీలోని శ్రీ కృష్ణ ప్రార్థనా మందిరంలో జూన్ ఒకటో తేదీన హనుమజ్జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు గోకవరపు మురళీకృష్ణ, గుడిపాటి పాపారావు తెలిపారు. మందిరం ప్రాంగణంలో సంకల్పసిద్ధి హనుమాన్ కొలువై ఉన్నారని పేర్కొన్నారు. హనుమజ్జయంతిని పురస్కరించుకొని స్వామి వారికి పలు విశేష వైదిక కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. అందులో భాగంగా ఉదయం విగ్రహ ప్రతిష్టాపకులచే ప్రాతఃకాలార్చన, అనంతరం గోక్షీరాభిషేకం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం స్వామి వారికి విశేష అలంకారం గావిస్తారని తెలిపారు. తరువాత సామూహిక నాగవలీ, దళసహస్ర నామార్చన తదితర కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ నైపుణ్యాలు పెంచుకోవాలి



లబ్బీపేట(విజయవాడతూర్పు): క్యాన్సర్ స్క్రీనింగ్ నైపుణ్యాలు పెంచుకోవడం ద్వారా వ్యాధి లక్షణాలు తొలిదశలో గుర్తించవచ్చునని ఎన్‌సీడీ–సీడీ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ నరశింగరావు అన్నారు. విజయవాడ సిద్ధార్థ వైద్య కళాశాలలో నిర్వహిస్తున్న క్యాన్సర్ స్క్రీనింగ్ శిక్షణ శిబిరంలో బుధవారం ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌ను ప్రారంభదశలో గుర్తించి, వ్యాధిని అదుపులో ఉంచేందుకు స్క్రీనింగ్ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విధులు నిర్వహించే సీహెచ్‌ఓలు, ఏఎన్‌ఎంలకు స్క్రీనింగ్‌పై అవగాహన కలిగించడంతో క్షేత్రస్థాయిలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్‌సీడీ–సీడీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ జి మాధవి తదితరులు పాల్గొన్నారు.

రసాయనిక శాస్త్రంపై అవగాహన



మైలవరం: రసాయనిక శాస్త్రంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని మైలవరం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు డి. శరత్‌బాబు అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మైలవరం శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో బుధవారం రసాయన శాస్త్రం గురించి ఉపాధ్యాయులు శరత్‌బాబు వివరించారు. రసాయన శాస్త్రంలో ఎలిమెంట్ యొక్క ఆవశ్యకతను వివరించారు. నిత్య జీవితంలో రసాయనిక ఎలిమెంట్స్ ఎంతో ఉపయోగపడతాయన్నారు. తాగునీటిని శుద్ధి చేసుకునేందుకు, పంటలు పండించడంలోను రసాయనిక ఎలిమెంట్స్ ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. అంతరిక్ష ప్రయోగంలో కూడా ఎలిమెంట్స్ ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.


పచ్చందాలు..



విజయవాడ నుంచి గన్నవరం వెళ్లే రహదారి పచ్చని చెట్లతో సరికొత్త అందాలను సంతరించుకొంది. హైవే మధ్యలో పెంచుతున్న మొక్కలను అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. రోజూ నీళ్లు పోస్తూ మొక్కలు ఏపుగా పెరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు. చల్లటి గాలితో పాటు నీడనిస్తున్న మొక్కలు చూసి అందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





అనధికార హోర్డింగ్‌లను తొలగించండి



పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలోని అన్ని ప్రాంతాల్లో అనధికారికంగా ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లను వెంటనే తొలగించాలని, ఏజెన్సీకి ఇచ్చిన గడువు పూర్తయితే, స్ట్రక్చరల్ స్టెబిలిటీ లేని హోర్డింగ్‌లను సైతం తొలగించాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. ప్రధాన కార్యాలయంలోని సమావేశపు హాలులో బుధవారం ఆయన పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, వార్డు సెక్రటరీలతో స్ట్రక్చరల్ స్టెబిలిటీ సర్టిఫికెట్‌లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సమావేశంలో ప్లానింగ్ సెక్రటరీలకు దీనిపై పలు సూచనలు చేశామని తెలిపారు. ఎంతవరకు పురోగతి సాధించారని కమిషనర్ ప్రశ్నించగా ఇప్పటి వరకు 224 ఖాళీ హోర్డింగ్ ఫ్రేమ్‌లను తొలగించామని, స్ట్రక్చరల్ స్టెబిలిటీపై ఏజెన్సీలకు నోటీసులు జారీ చేశామని వెల్లడించారు. జూన్ మొదటి వారంలో సర్టిఫికెట్ తీసుకోని వాటిని తొలగిస్తామని అధికారులు కమిషనర్‌కు నివేదించారు. సిటీ ప్లానర్ ప్రసాద్, డీసీపీ తదితరులు పాల్గొన్నారు.

దేశ చరిత్రలో జగన్ ప్రభుత్వానికి ప్రత్యేక స్థానం

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు వెలంపల్లి శ్రీనివాసరావు



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): గడిచిన ఐదేళ్లలో ఎన్నో విప్లవాత్మక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి నిరుపేద ప్రజల జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దేశ చరిత్రలో ప్రత్యేక స్థానం లభించిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడి ఐదు సంవత్సరాలు పూర్తయిన సందర్భాన్ని గుర్తుచేస్తూ బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కుల, మత, పార్టీలు, ప్రాంతాలకు అతీతంగా ప్రజారంజక పాలన అందించిన ఏకైక ప్రభుత్వంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా డీబీటీ ద్వారా నేరుగా లక్షల కోట్ల రూపాయలను లబ్ధిదారుల ఖాతాలలో జమ చేసి అవినీతి రహిత పాలనకు శ్రీకారం చుట్టిన గొప్ప ముఖ్యమంత్రిగా జగనన్న సరికొత్త చరిత్రను లిఖించారన్నారు. పథకాలకు అర్హతలే ప్రామాణికంగా ఎటువంటి వివక్షకు తావు లేకుండా వలంటీర్ల వ్యవస్థ ద్వారా నేరుగా ఇంటి గుమ్మం వద్దకే పాలనను తీసుకువచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. టీడీపీ ప్రభుత్వ పాలనలో ఏ చిన్న పని కావాలన్నా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఉండేదని, జగనన్న అధికారంలోకి వచ్చిన తరువాత కరోనా వంటి తీవ్ర సంక్షోభ పరిస్థితుల్లో సైతం ప్రతి ఇంటికీ సంక్షేమాన్ని అందించారన్నారు. దేశ చరిత్రలో ఒకేసారి రికార్డ్ స్థాయిలో 1.34 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడంతో పాటుగా 2,06,638 పర్మినెంట్ ప్రభుత్వ ఉద్యోగాలు, 37,908 కాంట్రాక్టు ఉద్యోగాలు, 3,71,777 ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టి కేవలం నాలుగు నెలల్లోనే వాటి నియామకాలు పూర్తి చేసి రికార్డు సృష్టించారన్నారు.

రాష్ట్రంలో మరింత సంక్షేమ పథకాలు అమలుకావాలన్నా, రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో దూసుకుపోవాలన్నా మరోసారి ముఖ్యమంత్రిగా జగన్ మోహన్ రెడ్డి రావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని, ప్రజలందరి దీవెనలతో జూన్ 4వ తేదీన వైఎస్సార్‌సీపీ అభ్యర్థులంతా అఖండ మెజార్టీలతో విజయాలు సాధించనున్నారని ధీమా వ్యక్తంచేశారు. జూన్ 9న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిగా విశాఖలో ప్రమాణస్వీకారం చేయడం తథ్యమని అన్నారు.

బోధనా పద్ధతుల్లో మార్పులు తప్పనిసరి



మాట్లాడుతున్న డాక్టర్ బాబు రెడ్డి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):అధ్యాపకులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తమ బోధనా పద్ధతులను తీర్చి దిద్దుకోవాలని కృష్ణా విశ్వవిద్యాలయం కంప్యూటర్స్ విభాగ ఆచార్యులు డాక్టర్ ఎం.బాబూరెడ్డి అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల ఐక్యూఏసీ విభాగం ఆధ్వర్యంలో 'తరగతి గదిలో సమగ్ర బోధనా పద్ధతులు' అంశంపై సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన వక్తగా హాజరైన బాబూరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా అన్ని రంగాల్లోనూ విప్లవాత్మకమైన మార్పులు, అభివృద్ధి చోటు చేసుకుంటుందని తెలిపారు. ఆ క్రమంలో విద్యారంగంలోనూ మార్పులు అనివార్యమయ్యాయని చెప్పారు. విద్యార్థులు పోటీ ప్రపంచంలో చక్కగా రాణించే దిశగా వారిని తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆయా రంగాల్లో వస్తున్న మార్పులు, అభివృద్ధి, అధ్యయనం వంటి అనేక అంశాలను విద్యార్థులకు తెలియజేసే దిశగా బోధనా పద్ధతుల్లో మార్పులు తీసుకురావాలని సూచించారు. ఆ దిశగా అధ్యాపకులు తమను తాము తీర్చిదిద్దుకోవాలని కోరారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ ఉన్నత విద్యారంగంలో అనేక మార్పులను అధ్యాపకులు ఆహ్వానించాలన్నారు. మౌలికమైన అంశాలతో పాటుగా సమకాలీన పద్ధతులను జోడించుకొని అధ్యాపకులు తమ బోధనను కొనసాగించాలని సూచించారు. తద్వారా విద్యార్థులకు అత్యంత మేలు కలుగుతుందని వివరించారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ జి.కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామకృష్ణ, అధ్యాపకులు షమీమ్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

వెస్ట్ ఏసీపీ రామకృష్ణారెడ్డి



పార్టీ నేతలతో మాట్లాడుతున్న వెస్ట్ ఏసీపీ రామకృష్ణారెడ్డి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):కౌంటింగ్ రోజున అన్ని పార్టీల నేతలు, కార్యకర్తలు సంయమనం పాటించాలని, నిబంధనలను అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని వెస్ట్ ఏసీపీ రామకృష్ణారెడ్డి తెలిపారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని పార్టీలకు చెందిన ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో బుధవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. గణపతిరావు రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వెస్ట్ ఏసీపీ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కౌంటింగ్ సందర్భంగా ఎవరైనా అల్లర్లకు పాల్పడినా, ర్యాలీలు నిర్వహించినా, బాణసంచా కాల్చినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని, అప్పటి వరకు ప్రతి ఒక్కరు సమన్వయం పాటించాలని సూచించారు. ప్రజలందరూ తమ తమ ఇళ్లకే పరిమితం అయ్యి ఎన్నికల ఫలితాలను ఆస్వాదించాలన్నారు. అభ్యర్థులపైన ఎవరైనా పందేలు వేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. మూడో తేదీ నుంచి మూడు రోజుల పాటు మద్యం దుకాణాలు మూసివేసి ఉంచడం జరుగుతుందని, అదే విధంగా పెట్రోల్ బంకులో బాటిల్స్‌లో పెట్రోల్ ఇవ్వడం నిషేధమన్నారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాలను ఇప్పటికే గుర్తించి పికెట్‌లు ఏర్పాటు చేశామన్నారు. విజయవాడ పరిధిలో 144 సెక్షన్‌తో పాటు 30 పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందన్నారు. సమావేశానికి కొత్తపేట సీఐ గణేష్ పర్యవేక్షణలో నిర్వహించగా స్టేషన్ ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సప్తగిరి సంకీర్తనలతో పులకించిన వేంకటేశ్వరుడు



అన్నమయ్య సంకీర్తనలు గానం చేస్తున్న గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్, బుల్లెమ్మ

విజయవాడ కల్చరల్: శ్రీ వెంకటేశ్వరా సంకీర్తనా అకాడమీ, శ్రీ కంచిపీఠపాలిత వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న పద కవితా పితామహుడు తాళ్ళపాక అన్నమాచార్య 616 జయంతి వేడుకలు బుధవారం ముగిసాయి. తాళ్ళపాక అన్నమాచార్యుడు రచించిన సంకీర్తలు భావములోన, బ్రహ్మకడిగిన పాదము, పొడగంటిమయ్య, కొండలలోన, నారాయణతే నమో నమో, ముద్దుగారే యశోద కీర్తనలు టీటీడీ ఆస్థాన గాయనీ గాయకులు గరిమెళ్ళ బాల కృష్ణ ప్రసాద్, బుల్లెమ్మ, అన్నమయ్య మధురంగా గానం చేశారు. సప్తగిరుల గోష్టిగానంలో నగరానికి చెందిన పలువురు గాయనీ గాయకులు పాల్గొన్నారు. గరిమెళ్ళ బాల కృష్ణ ప్రసాద్‌ను, బుల్లెమ్మను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. అలివేలు మంగా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామికి వైభవంగా ఊంజల్ సేవ నిర్వహించారు. ఉదయం జరిగిన సంకీర్తన సేవలో దుగ్గిరాల హస మేధ, చింతలపాటి మంజుల, సీతారత్నం బృందం, కె. అలిస్‌కుమార్, జయతి, మహతి, దివ్య మీనా కృష్ణన్ పాల్గొన్నారు. కార్యక్రమాలను సంస్థ నిర్వాహకులు సత్యబాబు, ప్రసాద్ నిర్వహించారు.

ఆరోగ్యం.. ఆహ్లాదం...





బెజవాడ వాసులు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. యోగా శిక్షణ, వాకింగ్, జాగింగ్, ఇతర వ్యాయామాలు చేస్తూ తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకుంటున్నారు. నగరంలోని పెద్ద సంఖ్యలో యువతీ యువకులు, వృద్ధులు, మహిళలు తెల్లవారుజాము నుంచే వాకింగ్ చేయడానికి వస్తున్నారు. సమీపంలోని పార్కులు, స్టేడియాలకు వెళ్లి ఆహ్లాదకరమైన వాతావరణంలో వాకింగ్, జాగింగ్ చేస్తున్నారు. కొందరు యోగా తరగతులకు హాజరై ఆసనాలు ప్రాక్టీసు చేస్తున్నారు. విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో ఉదయాన్నే నగరవాసులు జాగింగ్‌తో పాటు వ్యాయామాలు చేస్తున్న చిత్రాలివి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం



స్వామి వారి కల్యాణోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):వన్‌టౌన్‌లోని వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. బ్రాహ్మణవీధిలో దేవదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని పురాతన ఆలయాల్లో ఒకటైన వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో స్వామి వారి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామి వారికి శాంతి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. వైశాఖ మాసంలో వచ్చిన శ్రవణ నక్షత్రం కావటంతో అత్యంత పవిత్రమైనదిగా భావించి భక్తులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని శ్రీకృష్ణ మండపంలో స్వామి వారి ఉత్సవ మూర్తులను మేళతాళాలతో తీసుకొచ్చి కల్యాణవేదిక్పై వేంచేయించారు. అనంతరం ఆలయ అర్చక స్వాములు పి.రామచంద్రమూర్తి పర్యవేక్షణలో స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. తొలుత విష్వక్సేనపూజతో కల్యాణోత్సవానికి శ్రీకారం చుట్టారు. అనంతరం మహాసంకల్పం, ప్రవర, యజ్ఞపవీతధారణ, జీలకర్రబెల్లం ధారణ, మంగళ్యధారణ, చివరిగా తలంబ్రాల సమర్పణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా తిరుమంజనం

స్వామి వారి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకొని ఆలయంలోని స్వామి వారి మూలవిరాట్‌కు తిరుమంజన వైభవంగా నిర్వహించారు. వివిధ ఫల, సుగంధ ద్రవ్యాలతో, పంచామృతాలతో స్వామి వారిని అభిషేకించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక అలంకారం చేశారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. వైదిక కార్యక్రమాలను కార్యనిర్వహణాధికారి ఘంటసాల శ్రీనివాస్ పర్యవేక్షించారు.

మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

పెనమలూరు: మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరుకు చెందిన సొంటి సురేష్ చోడవరం నాగేంద్రస్వామి గుడి వద్ద మద్యం అక్రమంగా విక్రయిస్తుండటంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకన్నారు. అతని వద్ద 8 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

సగర్ల సంక్షేమ సంఘ నాయకుడు గండికోట మృతి



గన్నవరం: మండలంలోని బుద్దవరం శివారు రాజీవ్ నగర్‌కాలనీకి చెందిన సగర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గండికోట సీతారామయ్య(58) బుధవారం కన్నుమూశారు. మంగళవారం సాయంత్రం అస్వస్థతకు గురైన ఆయన విజయవాడలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సీతారామయ్య మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నేతలు, స్థానికులు సంతాపం వ్యక్తం చేశారు. రాజీవ్‌నగర్‌కాలనీలోని శ్రీసంతానవిజయ కనకదుర్గదేవి ఆలయ అధ్యక్షుడిగా, రియల్ ఎస్టేట్ మధ్యవర్తుల సంఘం గౌరవాధ్యక్షుడిగా సీతారామయ్య వ్యవహరించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

జిల్లా అదనపు వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జూపూడి ఉషారాణి



రక్తదాన శిబిర నిర్వాహకులను మొక్కతో అభినందిస్తున్న డాక్టర్ జూపూడి ఉషారాణి

మధురానగర్(విజయవాడసెంట్రల్): రక్తదానం ప్రాణదానంతో సమానం అని, ఒకరి రక్తదానం ముగ్గురి ప్రాణాలను నిలుపుతుందని, రక్తదానం చేయటం అలవాటుగా చేసుకోవాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జూపూడి ఉషారాణి సూచించారు. ఏలూరు రోడ్డులో బుధవారం వరల్డ్ మిషన్ సొసైటీ చర్చ్ ఆఫ్ గాడ్ సంస్థ 60వ వార్షికోత్సవం సందర్భంగా నైట్రో బ్లూ కంపెనీ సహకారంతో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్న చర్చ్ ఆఫ్ గాడ్ నిర్వాహకులు, సహకరించిన నైట్రో బ్లూ సరఫరాదారులను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. 1475 రక్తదానం శిబిరాలు నిర్వహించిన వరల్డ్ మిషన్ సొసైటీ చర్చ్ ఆఫ్ గాడ్ సంస్థ సభ్యులను అభినందించారు. చర్చ్ ఆఫ్ గాడ్ ప్రతినిధి జేమ్స్, నైట్రో బ్లూ కంపెనీ మార్కెటింగ్ హెడ్ షరీఫ్ తదితరులు మాట్లాడారు. అనంతరం 150 మంది రక్తదానం చేశారు. నిర్వాహకులు, రక్తదాతలను డాక్టర్ జూపూడి ఉషారాణి సర్టిఫికెట్, మొక్కతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా పోగ్రామ్ ఆఫీసర్ కిరణ్ పండిటి, వరల్డ్ మిషన్ సొసైటీ చర్చ్ ఆఫ్ గాడ్ మేనేజర్ పీటర్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాలిసెట్ కౌన్సెలింగ్

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం పాలిటెక్నిక్ కోర్సులకు సంబంధించి పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. 33,001 నుంచి 38వేల ర్యాంకు వరకు ఉన్న అభ్యర్థులు కౌన్సెలింగ్‌లో వారి సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకున్నారు. కౌన్సెలింగ్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, కో ఆర్డినేటర్ బాలసుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు. గురువారం 49,001 నుంచి 54 వేల ర్యాంకు అభ్యర్థులకు కౌన్సెలింగ్ ఉటుందని ప్రిన్సిపాల్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు.

అదుపుతప్పి లారీని ఢీకొట్టిన కారు

ఇబ్రహీంపట్నం: ఒవర్‌టేక్ చేయబోయిన కారు డ్రైవర్ అదుపుతప్పి లారీని ఢీకొట్టాడు. బుధవారం తెల్లవారుజామున 65వ నంబర్ జాతీయ రహదారిపై జరిగిన ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఓ కుటుంబం తమ కారులో ఏలూరుకు బయలుదేరారు. పశ్చిమ ఇబ్రహీంపట్నం వద్దకు రాగానే లారీని ఒవర్ టేక్ చేయబోయిన కారు డ్రైవర్ అదుపు తప్పి అదే లారీని వెనుక వైపు ఢీ కొట్టాడు. అప్రమత్తమైన డ్రైవర్ కారును పక్కకు తప్పించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సీట్ బెల్ట్‌లు పెట్టుకోవడం, ఎయిర్ బ్యాగ్‌లు ఓపెన్ కావడంతో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. ఏఎస్ఐ సాధిక్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయవాడ వెస్ట్ :
90102 10386
Office mail : sakshiads@gmail.com